క్లుప్తంగా

డిసెంబర్‌లో శ్రీకాళహస్తిలో ఏఐటీయూసీ జిల్లా మహాసభలు

తిరుపతి కల్చరల్: శ్రీకాళహస్తిలో డిసెంబర్ 17, 18, 19 తేదీల్లో ఏఐటీయూసీ తిరుపతి జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాక్రిష్ణ తెలిపారు. స్థానిక గంధమనేని శివయ్య భవన్‌లో బుధవారం ఏఐటీయూసీ తిరుపతి నగర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత తిరుపతి జిల్లాలో మొదటి సారిగా మహాసభలను శ్రీకాళహస్తి పట్టణంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మొదటి రోజు భారీ బహిరంగ సభ, తర్వాత ప్రతినిధుల సభ ఉంటాయని తెలిపారు. చివరి రోజు జిల్లా నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటామని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి తుడా: నగరంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని నగర డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ తెలిపారు. ఆయన బుధవారం 14వ డివిజన్‌లోని రెండో వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులై ఉండి పథకాలు అందకుండా ఉంటే అందుకు వార్డు సెక్రటరీనే బాధ్యత వహించాలన్నారు. సకాలంలో సచివాలయ సిబ్బంది విధులకు హాజరుకావాలని, ప్రజలతో నిత్యం మమేకం కావాలని సూచించారు.

సీఎం జగన్‌పై టీడీపీ నేతల విమర్శలు విడ్డూరం

తిరుపతి కల్చరల్: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అని అవహేళన చేసిన చరిత్ర టీడీపీ అధినేత చంద్రబాబుదని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో దళితులపై అనేక దాడులు చేసినా ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం దారుణమని వర్ల రామయ్యపై మండిపడ్డారు. నేడు చంద్రబాబు మెప్పు కోసం పసలేని విమర్శలు చేస్తూ ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులతో సర్పంచ్ ముదికుప్పం రూప

చంద్రగిరి: ఎంత పెంచుకున్నా తరిగిపోని ఆస్తి విజ్ఞానమని, ఆ విజ్ఞానం గ్రంథాలయాల్లో మాత్రమే లభిస్తుందని చంద్రగిరి సర్పంచ్ ముదికుప్పం రూప తెలిపారు. 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పాతపేటలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడాన్ని అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. గ్రంథాలయ అధికారిణి రెడ్డెమ్మ, పాల్గొన్నారు.

ఘనంగా బిర్సాముండా జయంతి



బిర్సాముండా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా జయంతిని బుధవారం తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆర్.జె.రమాశ్రీ మాట్లాడుతూ దేశనాయకులను ఆదర్శంగా తీసుకుని సామాజ సేవలో ముందుకు సాగాలని సూచించారు.

బీజేపీ కార్యాలయంలో..



బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి గాంధీ రోడ్డు: గిరిజనుల కోసం బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన బిర్సా ముండా జయంతిని బుధవారం బీజేపీ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బండ్లవీధిలో ఉన్న బీజేపీ కార్యాలయంలో బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం యాదవ్, అక్కినపల్లి మునికృష్ణ యాదవ్, సుబ్రమణ్యం రెడ్డి, విజయ్ కుమార్, రాధారెడ్డి పాల్గొన్నారు.

కాంచిన కనులదే భాగ్యం

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం అమ్మవారు సర్వభూపాల వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి గరుడుడిపై కొలువుదీరి భక్తకోటిని కటాక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సిరుల తల్లిని దర్శించుకున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల వైభవాన్ని చూసి తరించారు. ఈ సందర్భంగా కళాకారుల కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

–తిరుచానూరు (చంద్రగిరి)



గరుడ వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, అధికారులు



గరుడ వాహన సేవకు తరలివచ్చిన భక్తులు





వాహన సేవ ముందు కళాకారుల ప్రదర్శనలు

విద్యార్థులకు క్రీడా పరికరాలు వితరణ



ఎంఆర్‌పల్లి హైస్కూల్‌కు క్రీడా పరికరాలు అందజేస్తున్న రాష్ట్ర సహకార బ్యాంక్ సీజీఎం



విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ, స్వీట్లు పంపిణీ చేస్తున్న చిల్లీస్ అధినేత అంజి

తిరుపతి కల్చరల్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంక్ తిరుపతి బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేశారు. ముత్యాలరెడ్డి పల్లి హైస్కూల్లో నిర్వహించిన బాలల దినోత్సవంలో విజయవాడకు చెందిన రాష్ట్ర సహకార బ్యాంక్ హెడ్ ఆఫీస్ సీజీఎం ఎన్.వెంకటరత్నం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార బ్యాంక్ తిరుపతి బ్రాంచ్ మేనేజర్ ఎం.ప్రసాద్, బ్రాంచ్ సిబ్బంది, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు, చిల్లీస్ హోటల్స్ అధినేత అంజి ఆధ్వర్యంలో నగరంలోని పలు మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ, తినుబండారాలు, స్వీట్లు అందజేశారు. అంజి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని కోరారు. కార్యక్రమంలో చిల్లీస్ సిబ్బంది రాజా, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్వీయూ అధ్యాపకుడు కోదండరెడ్డి, డైరెక్టర్ సురేష్ కుమార్

తిరుపతి సిటీ: స్థానిక ఎమ్మార్‌పల్లి సర్కిల్ వద్దనున్న డాక్టర్ గిండీస్ ఐఏఎస్ అకాడమీలో బుధవారం పోటీ పరీక్షలను ఎదుర్కోవడంపై ఎస్వీయూ ఆంత్రోపాలజీ విభాగ అధ్యాపకుడు కోదండరెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సివిల్స్, గ్రూప్ 1, 2 పరీక్షలకు ఆంత్రోపాలజీ ఆప్షనల్‌పై పూర్తిస్థాయి అవగాహన కల్పించి ప్రపంచ, భారత భౌగోళిక శాస్త్ర సమగ్ర సమాచారాన్ని పుస్తక రూపంలో అందించారు. అనంతరం పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. డైరెక్టర్ డాక్టర్ సురేష్ కుమార్ గిండి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి



పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న సర్పంచ్ సునిత

పాకాల: విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని దామలచెరువు సర్పంచ్ సునిత తెలిపారు. దామలచెరువు శాఖా గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్థానిక గ్రంథాలయంలో సుమారు 10 వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఇమ్రాన్, హెచ్ఎం విజయమోహన్ రెడ్డెప్ప, ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి మురళీబాబు, పాఠకులు వెంకయ్య, చంద్ర, కిషోర్, రామకృష్ణ పాల్గొన్నారు.

కృష్ణా జలాల పునః పంపిణీ నోటిఫికేషన్ రద్దు చేయాలి

తిరుపతి కల్చరల్: కృష్ణా జలాల పునః పంపిణీపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరువు పీడిత మండలాల్లో సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 20, 21న విజయవాడలో 30 గంటల నిరసన దీక్ష చేపట్టనున్నట్టు తెలిపారు. ఆయన బుధవారం సీపీఐ కార్యాలయంలో దీక్ష పోస్టరును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణానది నీటి వివాదాలపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్టుల వారీగా 811 టీఎంసీల నీటిని కేటాయించినట్టు తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 199 టీఎంసీలు వాడుకుంటున్నాయని తెలిపారు. మిగులు జలాలను వాడుకునే వెసులుబాటును బ్రిజేష్ కుమార్ కాలరాయడంపై సుప్రీం కోర్టులో కేసు నడుస్తోందన్నారు. కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండగా బ్రిజేష్ కుమార్ తీర్పు అమల్లోకి రాకుండానే కేంద్రంలోని బీజేపీ ఓట్ల కోసం రాష్ట్రాల మధ్య నీటి వివాదాలను జటిలం చేసి లబ్ధిపొందాలని చూస్తోందన్నారు. దీన్ని తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు విశ్వనాథ్, కె.రాధాక్రిష్ణ, ఎస్.శివ, ఎన్‌డీ.రవి, కేవై.రాజా, రామకృష్ణ, గోవిందస్వామి, బాల, పూర్ణ, శ్రీనివాస్, ప్రమీల, అల్లాబాషా, వెంకటేష్ పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

తిరుపతి సిటీ: యోగాతో ఒత్తిడిని అధిగమించవచ్చని స్విమ్స్ సీనియర్ ప్రొఫెసర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ వనజాక్షమ్మ తెలిపారు. టీటీడీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం రోటరీ తిరుపతి గ్రేటర్ సిటీ, పీస్ పార్క్, స్వర్ణముఖి ఆధ్వర్యంలో మహిళల జీవనశైలి విధానంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆధునిక ప్రపంచంలో ఎక్కువ ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఒత్తిడిని అధిగమించేందుకు యోగా చేయాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించాలన్నారు. రోటరీ గ్రేటర్ సిటీ అధ్యక్షుడు, స్విమ్స్ డాక్టర్ మునస్వామి మాట్లాడుతూ మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండడమే ఆరోగ్యమన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భద్రమణి, వనజ మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. రోటరీ జోనల్ గవర్నర్ విశ్వప్రకాష్ మాట్లాడుతూ రోటరీ ప్రాముఖ్యతను, సేవా భావాన్ని, బిల్ గేట్స్ ద్వారా పోలియో నిర్మూలనలో రోటరీ పాత్రను వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ శాంతి, బి.మహేశ్వరి, మహదేవమ్మ, లక్ష్మి, అరుణకుమారి, శిరీష, విద్యుల్లత పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కృష్ణ అభిమాన సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: సూపర్ స్టార్ కృష్ణ ప్రథమ వర్ధంతిని బుధవారం ఆయన అభిమానులు జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ అభిమాన సంఘం నేతలు ఏవన్ మస్తాన్, తులసీ యాదవ్, దొడ్డారెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఈతమాకుల హేమంత్, నాగేంద్ర, వెంకటేష్, సుబ్బు, గోపి, బాబి బ్రదర్స్ పాల్గొన్నారు. అదేవిధంగా సూపర్ స్టార్ కృష్ణకు రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, సుబ్రమణ్యం యాదవ్, ఎ.మునిక్రిష్ణయ్య, సుబ్రమణ్యంరెడ్డి, విజయకుమార్, కళాకారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



ధార్మిక పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న టీటీడీ జేఈవో సదా భార్గవి

తిరుపతి కల్చరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, టీటీడీ పాఠశాలల విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాలను సందర్శించి కొత్త విషయాలను నేర్చుకోవాలని టీటీడీ జేఈవో సదా భార్గవి తెలిపారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతపై బుధవారం శ్వేత భవన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. టీటీడీ పాఠశాలల విద్యార్థులకు వారానికి ఒక రోజు లైబ్రరీ క్లాస్ ప్రారంభించాలని, ఇందులో ఒక గంట సేపు విద్యార్థులు గ్రంథాలయంలో గడిపేలా చూడాలని అధికారులకు సూచించారు. ధార్మిక ప్రవచన కర్త సి.అనంతలక్ష్మి ధార్మిక, వ్యక్తిత్వ వికాస విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర గ్రంథాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టీటీడీ సీఏవో శేషశైలేంద్ర, విద్యాశాఖాధికారి ఎం.భాస్కర్‌రెడ్డి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టి

- తూకివాకం రికవరీ ప్లాంట్స్ పనితీరు భేష్
- తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత



చెత్త నిర్వహణ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు అనుగుణంగా తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని కమిషనర్ హరిత తెలిపారు. ఆమె బుధవారం అధికారులతో కలిసి తూకివాకం గ్రీన్ సిటీని పరిశీలించారు. బయోమెథన్ గ్యాస్, తడి, పొడి చెత్త, ఎరువుల తయారీ, సీ అండ్ డీ ప్లాంట్ల పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చెత్త నుంచి సంపద సృష్టిస్తున్నామన్నారు. తడి, పొడి చెత్తతో తయారు చేస్తున్న ఎరువులను రైతులకు అందించేలా ప్రణాళికలు రచిస్తున్నట్టు చెప్పారు. అనంతరం తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేసే నిర్వాహకులతో మాట్లాడారు. ఎరువుల ఉత్పత్తి పనులు అనుకున్న రీతిలో కావడం లేదని, ఎక్కువ మందిని నియమించి పెద్ద మొత్తంలో ఎరువులు తయారు చేయాలన్నారు. ఎరువుల తయారీకి అవసరమైన తడి చెత్తను సేకరించి నిరంతరం అందించేలా చూడాలని ఇంజినీర్లను ఆదేశించారు. అదేవిధంగా డ్రై వేస్ట్ రికవరీ ప్లాంట్ ను పరిశీలించి, పనుల వేగవంతానికి తగు చర్యలు చేపట్టాలన్నారు. సీ అండ్ డీ వేస్ట్ మెటీరియల్ రికవరీ విధానంలో పేవ్‌మెంట్ బ్లాక్స్ తయారీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

చురుగ్గా అంతర్గత రోడ్ల నిర్మాణం



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో అంతర్గత రహదారుల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం అలిపిరి రోడ్డు – ఓల్డ్ మెటర్నటీ రోడ్డును కలుపుతూ నిర్మిస్తున్న లింక్ రోడ్డు, తిలక్ రోడ్డు– జబ్బార్ లే అవుట్ రోడ్డును కలుపుతూ చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించి, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సులభంగా వెళ్లేందుకు అంతర్గత రహదారులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ విషయాన్ని గుర్తించి నగరంలో విస్తృతంగా లింక్, కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అలిపిరి రోడ్డు– ఓల్డ్ మెటర్నిటీ రహదారులను కలుపుతూ అభివృద్ధి చేస్తున్న లింక్ రోడ్డుతో వివిధ ప్రాంతాలకు సులభంగా చేరుకోవచ్చన్నారు. అలాగూ రహదారుల స్థితి గతులను బట్టి ఆ ప్రాంతం అభివద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. దీని దృష్టిలో ఉంచుకుని తొలి ప్రాధాన్యతగా నగరంలో రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. రహదారుల అభివృద్ధిని గుర్తించిన ప్రజలు స్థానికంగా రోడ్లు వేయాలని ప్రజల నుంచి విజ్ఞప్తిలు వస్తున్నాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని రహదారులను అభివృద్ధి చేసి సులభవంతమైన ప్రజా రవాణాకు చర్యలు చేపడతామన్నారు. మున్సిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, కార్పొరేటర్ బసవ గీత, మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఇమామ్ సాహెబ్, ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ ఇమ్రాన్‌బాషా, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్, నాయకులు ఉదయ వంశీ, కళ్యాణ్ ప్రసాద్, జీవరత్నం రెడ్డి, బుల్లి, హరికృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

టీబీ వార్డు భవనానికి రూ.1.79 కోట్ల మంజూరు



మాట్లాడుతున్న డాక్టర్ రవిప్రభు

తిరుపతి తుడా: రుయా ఆసుపత్రిలోని టీబీ వార్డు నూతన భవన నిర్మాణానికి రూ.1.79 కోట్లను టీటీడీ పాలకమండలి కేటాయించడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు తెలిపారు. ఆయన బుధవారం డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రుయాలోని టీబీటీ వార్డు భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఈ సమస్యను రుయా అభివృద్ధి వర్కింగ్ కమిటీ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్‌తో కలిసి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. టీటీడీ బోర్డు సమావేశంలో రూ.1.79 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. రాయలసీమ పెద్ద ఆసుపత్రిగా సేవలందిస్తున్న రుయా అభివృద్ధికి సహకరించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నాడు – నేడు కింద సుమారు రూ.450 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. రూ.23.75 కోట్లతో 50 పడకల సామర్థ్యంతో క్రిటికల్ కేర్ భవనాన్ని నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే అక్యూట్ కేర్ నూతన బ్లాక్‌ను రూ.26.91 కోట్లతో చేపట్టినట్టు తెలిపారు.

తిరుపతిలో క్రీడాకారుల ర్యాలీ



తిరుపతి కల్చరల్: ప్రపంచ క్రికెట్ కప్ సెమీ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై భారత్ జట్టు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ జెన్ అకాడమీ క్రికెట్ క్రీడాకారులు, బ్లైండ్ జూడో క్రీడాకారులు ర్యాలీ చేపట్టారు. జెన్ అకాడమీ కార్యదర్శి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా భారత్ జట్టు సమష్టిగా అన్ని బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అద్భుతంగా రాణిస్తూ విజయం సాధించి ఫైనల్ చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెన్ అకాడమీ ఉపాధ్యక్షులు అంజి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



చంద్రగిరి: వధువు కుటుంబ సభ్యులకు పెళ్లి కానుక అందజేస్తున్న నాయకులు



పాకాల: పెళ్లి కానుక అందజేస్తున్న నాయకులు

చంద్రగిరి: మండలంలోని ఐతేపల్లి పంచాయతీ కొత్తపల్లికి చెందిన చందన, హేమకుమార్‌కు వివాహం నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక కింద బంగారు తాళిబొట్టు, పట్టువస్త్రాలు, శ్రీవారి లడ్డూ–వడ, అమ్మవారి పసుపు–కుంకుమ, వెండి మెట్టెలు పంపించారు. వాటిని బుధవారం వైఎస్సార్ సీపీ చంద్రగిరి డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, సర్పంచ్ ఫాజిలా అందజేశారు. పంచాయతీ అధ్యక్షుడు కిషోర్, మాజీ సర్పంచ్ ఉమర్ సాహెబ్, నాయకులు రాజశేఖర్, అంజద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పాకాల: మండలంలోని కె.వడ్డేపల్లికి చెందిన నూతన వధూవరులు హేమభూషణ్, పావనికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని బుధవారం సర్పంచ్ వరలక్ష్మి, ఉపసర్పంచ్ శ్రీరాములురెడ్డి, లోకనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు.

కొటాల కిషన్ రెడ్డికి అభినందనల వెల్లువ



కొటాల కిషన్ రెడ్డిని అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

చంద్రగిరి: జేఈఈ పరీక్షలకు సంబంధించిన వెబ్‌సైట్‌ను రూపొందించిన ఇంటర్ విద్యార్థి కొటాల కిషన్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. మండలంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు కొటాల కిషన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా జేఈఈ ఎంట్రన్స్ పరీక్షలకు లక్షలాది మంది విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారని తెలిపారు. సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో చాలామంది వెనుకబడిపోతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారికి తాను రూపొందించిన వెబ్‌సైట్‌లో ఉన్న చార్జిబిటు ఫోర్ అనే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఎలాంటి ప్రశ్నకైనా సరైన సమాధానం లభిస్తుందని, విద్యార్థులు చేసే పొరబాట్లను అధ్యయనం చేసి సరిదిద్దుతుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, భవిష్యత్తులో ఈ వెబ్‌సైట్‌ను మరింతగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ నాగరాజ నాయుడు, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, మునికృష్ణ, అంజద్‌ఖాన్, మేడసాని ప్రవీణ్, భుజంగరావు, వేణుగోపాల్ రెడ్డి, వినోద్, రాజయ్య, రమణయ్య, విద్యానికేతన్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీయూ స్థలాన్ని ఇవ్వొద్దు

తిరుపతి సిటీ: ఎస్వీయూకు చెందిన స్థలాన్ని కంచి మఠానికి ఇవ్వడాన్ని ఏఐఎస్ఎఫ్ నాయకులు వ్యతిరేకించారు. వారు బుధవారం వర్సిటీ పరిపాలనా భవనం వద్ద మోకాళ్లపై నిలిచి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎస్వీయూ పాలక మండలి నిర్ణయం లేకుండానే అధికారులు ఏకపక్షంగా సర్వే నంబర్ 588లో ఉన్న 13.53 ఎకరాల భూమిని కంచి మఠానికి ఇవ్వడం దారుణమన్నారు. వెంటనే అనుమతులను రద్దు చేయాలనిన్నారు. ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ కార్యదర్శి సుందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్, జిల్లా అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.